"వెళ్ళండి పోకిరీవేషాలూ మీరూనూ-వాళ్ళని ఉసికొల్పి ఏమీ ఎరగనట్లు ఎలా చూస్తున్నాడో" అన్నాను తెచ్చిపెట్టుకున్న రోషంతో. పిల్లలు నవ్వుతున్నారు, రఘు నవ్వుతున్నాడు, ముగ్గురూ కలిసి నవ్వుతున్నారు. విరగబడి నవ్వుతున్నారు, ఆ నవ్వు తోటంతా సన్నజాజి పరిమళంలా, గంధం పొగలాగా, పొగమంచులా, వ్యాపించింది. అదేమిటో చూస్తుండగానే బాబీ—బేబీ రెండు చిన్న ఆకారాలూ నీడల్లా మారిపోతున్నాయి, నాకు కంగారెత్తింది. కాళ్లు వణికిపోతున్నాయి, గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి. పాతాళంలోకి క్రుంగిపోతున్నట్లనిపించింది. "నా పిల్లలు రఘూ అటుచూడు" అని అరుస్తున్నా...

హ్మా...మేము నీకింకా పుట్టలేదు. రఘుని నీవు పెళ్ళాడిఉంటే మేము పుట్టిఉండేవాళ్ళం—కాని రఘుకీ నీకూ యింకా పెళ్ళేకాలేదు! ఏ కారణాన మీరిద్దరూ పెళ్ళాడకుండా దూరమైపోయారో ఆ కారణానే రఘు. లక్నోలో ప్రొఫెసరుగా పని చేస్తున్నాడు. మేము మీ స్వప్న సంతానం మాత్రమే" అంటూ రఘురూపంలో కలసిపోయారు. మరోక్షణంలో రఘుకూడా అదృశ్యుడయాడు... కంగారునుంచి తెప్పరిల్లి చూసేసరికి నా గదిలో యీజీచైరులో ఆనుకొని ఉన్నాను...ఎదురుగుండా తివాసీమీద ట్యూషనుకు వచ్చిన పిల్లలు కూర్చుని ఉన్నారు. గోడమీదనున్న ఫోటోలోంచి రఘు నావంక చూస్తూ అదే కొంటెనవ్వు నవ్వుతున్నాడు. కాని యీసారి ఆ నవ్వులో జాలి కనిపించుతోంది!

(భావం: చార్లెస్ లాంబ్)

---

# చీకటి మడతలు

"భాస్కరభట్ల"

రీరం నడిచి నడిచి అలసిపోయి
ల్లో కుప్పగా కూలింది.

ఆఫీసు దుస్తులు మడతలుచెరిగి, నిర్జీవంగా గదిని నాలుగు వైపులా పరికిస్తున్నాయి. పుస్తకాల కుప్పలు, ధూళికళ్ళతో గదిమూలకు పడివున్న చొక్కాలు, ప్యాంట్లు, మాసి వాసనలు కొడుతూన్న మేజోళ్ళతో చూపులు కలుపుతున్నాయి. చొక్కాలు, ప్యాంట్లు, మేజోళ్ళు, సిగ్గుతో కళ్లు వాల్చేస్తున్నాయి. ఇనుపపొయ్యిపైన రాతి వెండిగిన్నెలోని అన్నం మడతల్లోకి నల్లచీమలు, బారులుతీరి చొచ్చుకొని వెడుతున్నాయి. చీకటి చూపులతో సారంగాల్ని తవ్వుతున్నాయి. రామనాథం చూపు, బద్ధకంగా, అన్నంపైన కదలుతూన్న నల్లచీమలపైన వాలుతున్నది. చీమలు, తమపైన వాలుతూన్న చూపును, కదలికతో చెదరగొడుతూ, మరీమరీ మడతల్లోకి చొచ్చుకొని వెడుతున్నాయి. ఉదయం తిని వదిలిన సగం తెల్లటి అన్నంలో చీమలు పాకడం, చూపునకు విశ్రాంతిని కలిగిస్తున్నది. నలుపు తెలుపును మింగుతున్నది. తెలుపు, కనుపాపలులేని పాలిపోయిన చూపుల్ని చూస్తున్నది. క్షణక్షణానికీ, తెలుపు, నలుపుమడతల్లో తలదాచుకుంటున్నది.

నలుపు తెలుపుమడతల్లో చిక్కి, ఉక్కిరిబిక్కిరవుతున్న రామనాథం చూపు, మెదడుచుట్టూ నలుపుతెలుపుల తెరల్ని దించింది. మెదడు, ఊపిరిసలపక, నలుపుతెలుపు తెరల్ని తీక్షణంగా చూచింది. ఆ తీక్షణవీక్షణానికి తట్టుకోలేక, నలుపు తెలుపుమడతల తెర మడతలు మడతలుగా కరిగింది. తెల్లటి వెన్నెల తెరల్ని విరిసింది. వెన్నెలమడతల్లో మెదడుచూపు, చెట్లఆకుల్లోంచి కురుస్తున్న వెన్నెల మచ్చలమీదుగా—దూరంగా, ఇంకా దూరంగా—వెన్నెల పువ్వుల పొగడచెట్టు క్రిందికి పాకింది...

యవ్వనపు దుస్తుల మడతల్లో రామనాథం—నొక్కులు నొక్కులుగా మడతలుపడి, జారుముడిలో అణగీ అణగని నల్లని తల నీలాల్లోని పొగడపువ్వుల తెల్లని మడతల్లో రాధ - రామనాథం, నల్లని తలనీలాల్ని మడతలుగా తన మొహంపైన కప్పుకుంటున్నాడు. సీకాయ వాసనలు, అలలు అలలుగా నలుగడలా వ్యాపించి, తెల్లని వెన్నెల పువ్వుల సువాసనలతో మిళితమై, అతనికి

మత్తెక్కిస్తున్నాయి. కళ్ళల్లో నల్లని తలనీలాల మడతలు నిలిచిపోతున్నాయి.

మెదడు, నల్లని తలనీలాల తెరల్ని తీవ్రంగా పరికించింది ఆ తీవ్రతకి, చీకట్లు సుళ్ళు తిరిగి, కరిగి పోవడం మొదలెట్టాయి.

దూరంగా, ఇంకా దూరంగా, కాటుకకళ శూన్యం, క్షణక్షణానికి విచ్చుకుంటున్నది ..వెన్నెల తెరల్ని దించుతున్నది. వెన్నెల గోడల్ని సృష్టిస్తున్నది; వెన్నెల గోడల వరుసలు, గదిగా రూపొందుతున్నాయి. మెదడుచూపు వెన్నెల గోడల పైనించి జారి, వెన్నెల చిలికిన గదిలోకి పాకుతున్నది.

యవ్వనపు మడతల్లో రామనాథం వెడల్పాటి కళ్ళల్లోని సిగ్గుదోంతరలతో సుశీల రామనాథం, సిగ్గుదొంతరల్ని ఒక్కొక్కటిగా తొలగించి, సుశీల కనుపాపల్లోకి, ఏకాగ్రతతో చూస్తున్నాడు. తిరిగి మూగుతోన్న చిలిపి సిగ్గుదొంతరల్ని ఆరాధిస్తున్నాడు. ఆ కనుపాపల్లో, తన ప్రతిబింబంచూచి, వివశుడై చివరకి సిగ్గుదొంతరల్ని తొలగించడం యిష్టంలేక, సుశీల నల్లటి చీకటి పాపల్లో కరిగి పోతున్నాడు. అతని కళ్ళలో ఆ వెడల్పాటి కళ్లు, ఆ కాటుక పాపలు, ఆ సిగ్గు దొంతరలు మడతలుగా సుళ్ళు తిరుగుతున్నాయి.

మెదడు, నల్లటి పాపల్లోని చీకటి మడతల్ని ఊరిమిచూచింది. మడతలు, ఆ చూపుల తీక్షణతకు, చీకటి సుళ్ళు తిరిగి కరిగిపోవడానికి ముందే, మడతగావేసి వున్నతలుపుల్ని ఎవరో కొట్టారు. అలసటతో, మడతలు మడతలుగా కుర్చీపైన పడి వున్న శరీరపు మడతల్ని దులిపి, మడతలు చెరిగిన దుస్తుల మడతలు సవరించి, రామనాథం, మడతల తలుపులు • తెరిచాడు. మడతలు పడ్డ దుస్తులతో పోస్టుమ్యాన్, కట్టలుకట్టలుగావున్న ఉత్తరాల్ని ఒక చేత్తో పట్టుకొని, ఇంకొక చేత్తో రామనాథానికి ఒక పార్సిల్ అందించాడు-మడత తలుపులు వేసి, మడతగావున్న పార్సిల్‌ని విప్పాడు రామనాథం, పార్సిల్లో మడతలు మడతలుగా రాధ తల నీలాలు అలలు అలలుగా సీకాయ వాసనలు, నల్లని తలనీలాల్లోంచి, ఈసారి, ఏమాత్రం రావడం లేదు. రామనాథం శరీరం, నల్లని తలనీలాల మడతల్ని చూడడంలోనే, పడకకుర్చీలో మడతలు మడతలుగా కూలింది.

మెదడు చుట్టూ నల్లటి తల నీలాల తెరలు, మడతలు మడతలుగా, అసంఖ్యాకంగా దిగాయి.

పుస్తకాల మడతలు, ధూళికళ్ళతో, సిగ్గు దొందరల తల నీలాల మడతల్లోకి తీక్షంగాచూచి, నిర్జీవమైన కటికచీకటిమడతల్లో లీనమైనాయి...

★

గేయం

# ప్రోషిత భర్తృక

శశాంక

పంజరాన చిలుక పైకెగిరిపోవె  
పరదేశమేగిన ప్రాణేశు తేవె!  
నడువ కాళ్ళాడక  
నుడువ నోరాడక  
అలిగిపోయే స్వామి  
నాపగ లేనైతి!  
పంజరాన చిలుక పైకెగిరి పో  
పరదేశమేగిన ప్రాణేశు తేవె!  
రేగేను నెరికురులు  
మాసేను మైజారు  
అలరింపులే లేక  
ఆరురాత్రులు గడచె!  
పంజరాన చిలుక పై కెగిరి పోవె  
పరదేశమేగిన ప్రాణేశు తేవె!  
మనసులో నాకేదొ  
దుందుడుకు తోచె  
కలగుండు వడి యెడద  
కళవళ పడియె!  
పంజరాన చిలుక పైకెగిరి పోవె  
పరదేశమేగిన ప్రాణేశు తేవె!  
పొలయలుకలనుమాని  
నెనరుంచి నాపైన  
మన్నించి స్వామిని  
మరలి రమ్మనవె!  
పంజరాన చిలుక పైకెగిరిపోవె  
పరదేశ మేగిన ప్రాణేశుతేవె!